

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు

వార్త


## పెన్నాబ్యారేజిని సందర్శించిన తెలుగుగంగ ఎస్ఇ



**సంగం డిసెంబర్ 11 ప్రభాతవార్త** మండల కేంద్రమైన సంగంలోని పెన్నా బ్యారేజిని తెలుగుగంగ ఎస్ఇ హరినారాయణరెడ్డి పరిశీలించారు. పెన్నాబ్యారేజికి ఇన్ఫ్లో ఎంత వస్తుండేది ఆయన పరిశీలించారు. సోమశిల ,కండలేరు డ్యామ్‌ల వద్ద కంట్రోల్ రూంలు ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. పెన్నా తీరప్రాంత ప్రజలు అ ప్రమత్తంగా ఉండాలని ఆయనసూచించారు. ఈకార్య క్రమంలో ఆయన వెంట ఇరిగేషన్ అధికా రులున్నారు.

## చెన్నవకేశవస్వామి గర్బగుడిలోకి చేరిన వరదనీరు



**బుచ్చి డిసెంబర్ 11 ప్రభాతవార్త** మాండూస్ తుఫాన్ కారణంగా బుచ్చిరెడ్డిపాలెం హరిజనవాడలోని చెన్నకేశవస్వామి ఆలయంలోని వరద నీరు చేరింది. ఆలయానికి చుట్టు ఉన్న రోడ్లన్ని ఎత్తు కావడంతో చుట్టుపక్కల నీరంతా శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామివారిఆలయంలో చేరింది. పాలకులు, అధికారులు స్పందించి ఆలయాన్నిఎత్తు లేపేందుకు సహకరించాలని హరి జనవాడ ప్రజలు అభ్యర్థిస్తున్నారు.

## తుఫాన్ ప్రభావంతో నీట మునిగిన పంట పొలాలు





**కావలి రూరల్, డిసెంబరు 11 ప్రభాతవార్త** మాండోస్ తుఫాన్ ప్రభావంతో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కావలి మండలంలోని పంట పొలాలు నీట మునిగి చెరువుల్ని తలపిస్తు న్నాయి. ఈ ప్రాంతంలో ప్రధానంగా ఈ సీజన్‌లో వరి పంట వేస్తారు. కొన్ని రోజుల క్రితం రైతులు వరి నాట్లు వేశారు. కావలి మండలంలో తక్కువ వర్షపాతం నమోదైనందున పెద్దగా రైతులకు నష్టం కలగలేదు. అధికంగా వర్షపాతం నమోదై వుంటే ఎక్కువగా నష్టం జరిగి వుండేది. వేరుశనగ పంట ఈ సీజన్‌లో తక్కువుగా వేయడం వల్ల అది కూడా వేసి కొన్ని రోజులైనందున నష్టం వాటిల్లే పరిస్థితి లేదు. దీంతో రైతులు ఊపిరిపీల్చుకు న్నారు. అయితే పై ప్రాంతాల నుండి కావలి మండలంలోని పంట పొలాలకు వర్షపు నీరు రావడంతో పంటలు వేసిన పొలాలు, పంటలు వేయని పొలాలు నీట మునిగాయి. ఇంతటితో వర్షం ఆగినట్లయితే నష్టాలు వుండవని ఇంకా వర్షాలు కొనసాగితే మాత్రం రైతులకు నష్టం వాటిల్లుతుంది. ఏదిఏమైనా ఈ వర్షాలకు రైతులకు పెద్దగా నష్టం లేకపోవడంతో ఊపిరిపీల్చుకుంటున్నారు.

## హైస్కూల్,బిసి కాలనీ జలమయం



**సంగం డిసెంబర్ 11 ప్రభాతవార్త** సంగం మండలం అన్నారెడ్డిపాళెంకి సంబంధించి వర్షాకాలం వస్తే జలమయమౌతుంది. దీనికి ప్రదాన కారణం బుడ్డిబాడవ డ్రైన్ (దొంగతూం) పూర్తి స్దాయిలో పూడి పోయినందువల్ల. ఈ డ్రైన్ నీటిని లాగలేక పోవడంతో బిసి కాలనీ జలమయమౌతుంది. అలాగే అన్నారెడ్డిపాలెం హైస్కూల్‌గ్రౌండ్ మొత్తం మునిగి పోతుంది. ఇటీవల బుడ్డిబాడవ డ్రైన్ కోవూరు నియోజకవర్గ పరిధిలో పూడిక తీశారు. పైభాగంలో పూడిక తీయ్యలేదు. ఇరిగేషన్ అధికారులు స్పందించి ఈ డ్రైన్ పూడిక తీయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అలాగే దొంగతూము రీమోడల్ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అన్నారెడ్డిపాళెం చివరి గ్రామం కావడంతో పై ప్రాంతం నీళ్లన్ని బిసికాలనీ, హైస్కూల్‌పైన వచ్చి పడుతున్నాయి. అదే బుడ్డిబాడవ డ్రైన్ పూడిక తీయిస్తే చాలా వరకు వరద తాకిడి తగ్గే అవకాశం ఉంది. ఏటా బిసి కాలనీ ప్రజలు వర్షాకాలం వస్తే పాములు ఇండ్లలోకి వస్తున్నాయంటు భయాం దోళనకు గురౌతున్నారు. పాలకులు, అధికారులు స్పందించి దొంగతూము రీమోడల్ చేయించి, డ్రైన్ పూడిక తీయించాల్సిన అవసరం ఎంతైనా వుంది.



## స్పందన వేదికను సద్వినియోగం చేసుకోండి



**నెల్లూరు కార్పొరేషన్, డిసెంబరు 11, ప్రభాతవార్త:** ప్రజా సమస్యల పరిష్కార వేదికగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలకు పరిష్కారం పొందాలని కమిషనర్ హరిత ఆకాంక్షించారు. 12వ తేదీ సోమవారం నాడు కార్యాలయంలో జరిగే స్పందన వేదికలో సమస్యల పరిష్కారం కోసం డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమంలో భాగంగా ఉదయం 9:30 గంటల నుంచి 10:30 గంటల వరకు 0861 2355678 నెంబరుకు ఫోన్ ద్వారా సమాచారం అందించాలని, అనంతరం కార్యాలయంలో కమిషనర్‌ను నేరుగా కలిసి సమస్యలను ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. అందుకున్న సమస్యలను వీలున్నంత త్వరగా పరిష్కారం అందించేందుకు అన్ని విభాగాలను సమన్వయం చేసుకుని కృషి చేస్తామని కమిషనర్ తెలిపారు.

## రైతులను ముంచేసిన మాండూస్



**చేజర్ల, డిసెంబర్11ప్రభాతవార్త:** మండలంలో మాండూస్ తుఫాన్ కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారు. మండలంలోని పలు వాగులు, వంకలు పొంగి పొర్లుతుండడంతో చాలా గ్రామాలకు మండల కేంద్రంతో సంబంధాలు తెగిపోయాయి. నల్లవాగు, పందలవాగు పొంగి పొర్లుతుండడంతో చాలా గ్రామాల ప్రజలు అత్యవసర పనుల నిమిత్తం గ్రామాలను దాటి వెళ్ళలేని పరిస్థితి ఏర్పడింది. తూర్పుకంభంపాడు, కోటితీర్థం గ్రామస్తులు చేజర్లకు వెళ్ళాలంటే నల్లవాగు పొంగిపొర్లు తుండడంతో కాకివాయితోపాటు అక్కడ వాగు కూడా ఉధృతంగా ప్రవహిస్తోంది. కాకివాయి, బిల్లుపాడు , యనమదల గ్రామాల ప్రజలు కూడా అత్యవసర పనుల నిమిత్తం ఎక్కడికీ వెళ్ళలేని పరిస్థితి ఏర్పడింది. గొల్లపల్లి వద్ద పందలవాగు పొంగుతుండడంతో మాముదూరు, ఓబులాయపల్లి, పెళ్ళేరు. పుల్లనీళ్ళపల్లి, పెరుమాళ్ళపాడు గ్రామాల ప్రజలు చేజర్లకు వెళ్ళాలన్నా వెళ్ళలేని పరిస్థితి ఏర్పడింది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తహసిల్దార్ పుట్టాబత్తిన విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు . అన్ని సచివాలయాల్లోను సిబ్బంది సెలవురోజులైనా అందుబాటులో ఉన్నారు. ప్రజలకు ఎలాంటి అవసరాలు వచ్చినా వెంటనే పరిశీలించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. నారుమడులు మునిగిపోయాయి. కొన్ని చోట్ల గోడలు, చెట్లు కూలిపోయాయి. మొత్తంమీద మాండూస్ తుఫాన్ మండలంలోని రైతాంగంపై తీవ్ర ప్రభావం చూపింది. వాగులవద్ద ఎవరైనా తెలియకుండా వెళతారేమోనని విఆర్ఓలు , విఆర్ఎలను వాగులవద్ద కాపలాగా ఉంచారు. పోలీస్ సిబ్బంది వాగుల వద్ద ఉండి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చూస్తున్నారు.

## ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి ప్రజాభిప్రాయ సేకరణ



**నెల్లూరు డిసెంబర్ 11, ప్రభాతవార్త-వైద్యం** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా. చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు నెల్లూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అబ్దుల్‌అజీజ్ ఆదేశాల మేరకు, 11వ క్లస్టర్ ఇన్‌చార్జ్, నెల్లూరు పార్లమెంటు మీడియా కోఆర్డినేటర్ జలదంకి. సుధాకర్ ఆధ్వర్యంలో ఆదివారం నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని గొల్లకందుకూరులో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ చేపట్టిన ఈ కార్యక్రమంపై ప్రజాభిప్రాయాలను సుధాకర్ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు రూరల్ నియోజకవర్గ యూనిట్ ఇన్‌చార్జ్ బెల్లంరెడ్డి. శ్రీనివాసులురెడ్డి, నెల్లూరు రూరల్ ఎస్సీసెల్ అధ్యక్షుడు తోడేటి. మురళి, బీసీసెల్ కార్యదర్శి చింతగింజల. సీనయ్య, గుడి. చిన్నమస్తానయ్య, గూగుల. ఎంకయ్య, నెల్లూరు పార్లమెంటు మైనార్టీ సెల్ కార్యదర్శి షేక్. సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

## తుఫాను ప్రభావంతో అయోమయంలో శనగరైతులు





**వలేటివారిపాలెం డిశంబరు 11,ప్రభాతవార్త** మండలంలో శనిఆదివారాలలో మాండ్యూస్ తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు మండలంలో శనగ రైతులు అయోమయంకు గురవుతున్నారు. శనివారం 28.6 మీ.మీ, ఆదివారం 3.2మి.మీ వర్షపాతం నమోదైంది. దీంతో మండలంలోని పంటచేలల్లో నీళ్లు నిలిచాయి. పైర్లు ఉరకెత్తే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు. రెండు రోజులు తరువాత కానీ వాస్తవ పరిస్థితి అర్థం కాదని పలువురు వివరిసున్నారు. మండలంలో గత వారం రోజులుగా శనగ విత్తనాలును ఎదపెట్టారు. పోకూ రు,నలదల పూరు ,శాఖవరం, కలవళ్ల, బడేవారిపాలెం, అత్తంటివారిపాలెం, కూనిపాలెం, కొండసముద్రం తదితర గ్రామాల్లో సుమారు 500ఎకరాలకి పైగా విత్తనాలు చల్లారు. ఎకరాకి సుమారు 25 నుంచి 50కేజీల దాకా వినియోగించారు. ఇందుకోసం విత్తనాలకే సుమారు రూ.10లక్షలకి పైగా వెచ్చించారు. దీంతో ఈ వర్షాలకు మొలకెత్తడం గగనమేనని పలువురు వాపోతున్నారు. అదేవిధంగా ముదురు మినుముకి సైతం ఎంతో కొంత నష్టం వాటిల్లనుందని తెలుస్తుంది. ఇకపోతే అమ్మపాలెం, నలదల పూరు. రోళ్లపాడు తదితర గ్రామాల్లో పొగాకు చేలలో నీరు నిలిచింది. ఈ చేలు ఉరకెత్తే ప్రమాదంఉందని రైతులు వాపోతున్నారు. ఈ సందర్భంగా రైతు అల్లం బ్రహ్మయ్య మాట్లాడుతూ వర్షం పడుతుండడం వలన చేలల్లో నీరు ఎల్లపెడుతున్నప ్పటికిని నీరు బయటకి పోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పొగచేలు ఎండకాస్తే ఉరకెత్తి చెట్లు పొదిగిపోతాయని బ్రహ్మయ్య ఆవేదన వ్యక్తం చేశారు. మరలా వేయాలంటే ఎకరాకి 10వేలు ఖర్చవుతుందని తెలిపారు. ఈ విషయమై వ్యవసాయ అధికారి హేమంత్ భరత్‌కుమార్ మాట్లాడుతూ శనగ విత్తనాలు మొలకెత్తుతాయా లేదా అనే విషయం రెండు రోజులు తర్వాత తెలుసు ్తుందన్నారు. అయినా రైతులకి విత్తనాలు రాయితీ పై మరలా ఇచ్చెందుకు ప్రతిపాదనలు చేస్తున్నట్లు తెలిపారు.

## గంగిరెడ్డికి సేవా పురస్కార సత్కారం



**సైదాపురం, డిసెంబరు 11, ప్రభాతవార్త:** వివిధ రంగాల్లో విశిష్ట సేవలను అందించిన వ్యక్తులను గుర్తించి వరల్డ్ హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ వారు సేవా పురస్కారాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆర్ఆర్‌డీఎస్ సంస్థ అధినేత ఊటుకూరి గంగిరెడ్డి గత 20 సంవత్సరాలుగా అందిస్తున్న పలు సేవలను గుర్తించి వరల్డ్ హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ వారు నెల్లూరులోని టౌన్‌హాలు నందు శనివారం జిల్లా పరిషత్ చైర్మన్ ఆనం అరుణమ్మ చేతుల మీదుగా గంగిరెడ్డికి సేవా పురస్కారం అందించి సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు.

## గరుగుపాలెంలో పడిపోయిన కరంటు స్దంభం

**కందుకూరు డిశంబరు 11, ప్రభాతవార్త** మండలంలోని గరుగుపాలెంలో వర్షాలకు కరెంటు స్దంభం పడిపోయింది. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. దీంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమాచారం తెలుసుకున్న విద్యుత్ ఏఈ మధుబాబు వెంటనే స్పందించారు. సర్పంచ్ సుబ్బరాజ్యం వైసీపీ నేతలు కిషోర్‌రెడ్డి తదితరులుతో సంప్రదించారు. జేసీబీ సహకారంతో పాత స్దంభం స్దానంలో కొత్త కరెంటు స్దంభాన్ని బిగించారు. విద్యుత్ సరఫరాను పునరుద్ధించారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.



## మానవత్వం చాటుకున్న కొడవలూరు పోలీసులు



**కొడవలూరు డిసెంబర్ 11 ప్రభాతవార్త :** కొడవలూరు మండలంలోని రాజుపాలెం దిన్నె గ్రామానికి చెందిన శేషురెడ్డి, వయస్సు సుమారు 70 సంవత్సరాలు అనే వ్యక్తి ఆదివారం నార్త్ రాజుపాలెం నుండి యలాయపాలెం పోవు ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలోని పొలాలు తూము గట్టు మీద కూర్చోని, ఒక్కసారిగా స్పృహ కోల్పోయి, కాలువలో పడిపోవడంతో అక్కడే విధిలో ఉన్న కొడవలూరుపోలీస్ స్టేషన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ వేమవరపు గోవర్ధన్, హోంగార్డు రామ్మోహన్, స్థానికులు సహకారంతో కాలవలో కొట్టుకొని పోతున్న శేషురెడ్డిని రక్షించి ఒడ్డుకు తీసుకొని వచ్చి వారి బంధువులకు తెలియజేసి వారికి అప్పగించడం జరిగింది, చాకచక్యంగా వ్యవహరించి శేషురెడ్డి ప్రాణాన్ని కాపాడిన పోలీసులను స్థానిక ప్రజలు అభినందించారు.

## పెట్రోల్ కొనుగోలు చేస్తే.... పెట్రోల్‌లో నీళ్లుస్తున్నాయి




**పొదలకూరు డిసెంబర్ 12 ప్రభాతవార్త** పొదలకూరు పట్టణంలో పెట్రోల్ బంకులో ఆయిల్ పట్టించుకునేందుకు వెళితే బాటిల్‌లో పెట్రోల్‌తోపాటు నీళ్లు వస్తున్నాయని బాదితులు ఆరోపిస్తు ఆదివారం ఒక పెట్రోల్ బంకు వద్ద ఆందోళన చేపట్టారు .పొదలకూరు మండలంలోని అయ్యావారిపాళెం క్రాస్ రోడ్డువద్ద ఉన్న పెట్రోల్ బంకులో ఆదివారం లీటర్ బాటిల్‌తో ఇద్దరు యువకులు పె ట్రోల్ కొనుగోలుకి వెల్లి లీటర్‌బాటిల్‌లో కొనుగోలు చేశారు. కొంత దూరం వెళ్లే సరికి బాటిల్‌లో నీళ్ళు కిందకి దిగి పెట్రోల్‌పైకి తేలింది. ఆశ్చర్యపోయిన కొనుగోలు దారులు హుటాహుటీన బంకు వద్దకు వెల్లి నిర్వాహకులను నిలిదీశారు. పని చేసే సిబ్బంది సమాదానం సక్రమంగా చెప్పకపోవడంతో ఆందోళన చేపట్టారు. ఇది ఇలా ఉంటే అప్పటికే వాహనాలలో ఆయిల్ నింపుకొని పోయిన వాహనదారులు కూడా కొంత దూరం ప్రయాణించే సరికి వాహనాలు ఆగిపోవడంతో చెక్ చేసుకొన్న డ్రైవర్లు ఆయిల్ ట్యాంకులో నీళ్లున్నట్లు గమనించి పెట్రోల్ కొనుగోలు చేసిన బంకు వద్దకు చేరి సిబ్బందిని నిలదీశారు. అప్పటికి బాధితుల ఆందోళన చేపడుతుండగా మరికొందరు చేరడంతో ఆందోళన కాస్త కొంత సేపు ఉద్రికత్తతకు దారి తీసింది. పెట్రోల్ బంకు యాజమాన్యం స్పందించి వాహనాల మరమ్మత్తులకు బాధ్యత వహిస్తామని తెలపడంతో ఉద్రిక్తత సద్దుమణిగింది. కొత్తగా నేర్మించి ఈ పెట్రోల్ బంకులో కనీస బాద్యత కూడా చేపట్టలేదు. ఎటువంటి సౌకర్యాలు నెలకొల్పలేదు. అధికారుల పర యవేక్షణ ఈ పెట్రోల్ బంకుపైన ఏ మాత్రం లేదని ఇందుకే పెట్రోల్ బంకు యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహారిస్తుందంటు బాధితులు వాపోయారు. జరిగిన ఘటన గురించి తెలుసుకున్న రెవిన్యూ అధికారులు స్పందించారు. సివిల్ సప్లయ్, డిప్యూటి తహసిల్దారు, ఐ. రవి పెట్రోల్ బంకు వద్దకు చేరుకొని పరిసితులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఆయిల్ అమ్మకాలను నిలుపుదల చేసి ఫిల్లిస్టేషన్ తాత్కాలికంగా మూత వేశారు. సేల్స్ఆఫీసర్ ఇండియన్ ఆయిల్ కార్పోరేషన్ మరియు అసిస్టెంట్ సప్లయ్ అధికారి తనీఖి చేసి వాహనాలకు పట్టిన పెట్రోల్‌ను, నాణ్యతను పరిక్షించి వాస్తవాలు తేలేంత వరకు పెట్రోల్ బంకు తెరవడానికి లేదని అదికారులు వెల్లడించారు. ఇటీవల కాలంలో పెట్రోల్ బంకులో ఇలా నీళ్ళు ఆయిల్ బంకు సిబ్బంది పట్టడం తరచుగా జరుగుతున్నా ఎటువంటి ప్రభుత్వ అధికారుల దాడులు లేక పోవడం గమనార్హం.

## పెనుబల్లి సర్పంచ్ చొరవతో కాలువల పూడికతీత



**బుచ్చి డిసెంబర్ 11 ప్రభాతవార్త:** భారీ వర్షానికి పెనుబల్లి దళితవాడ,ఎస్‌టికాలనీ అన్ని ముంపు కావడంతో కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సూచనల మేరకు కాలువలు వెంటనే పూడిక తీయించినట్లు గ్రామ సర్పంచ్ ఓడా పెంచలయ్య తెలిపారు.హరిజనవాడ,అరుందీవాడ,తిప్ప మీద నుండి ఇళ్లమీదకు వచ్చేనీళ్లన్ని పూడికతీయడంతో మెయిన్‌రోడ్డ పక్కనే ఉన్న కాలువ గుండా వెళ్లిపోయాయి.ఎస్‌టి కాలనీ మెయిన్ కాలువ పూడికతీయండతో నీరింతా వెల్లి పోయిందని ఆయన తెలిపారు. ఎక్కడ నీరు నిలబడకుండా పూర్తి స్దాయిలో కృషి చేసినట్లు ఆయన తెలిపారు.

## కావలి నియోజకవర్గంలో వైసిపిని మరింత బలోపేతం చేస్తాం



**కావలి, డిసెంబరు 11 ప్రభాతవార్త:** కావలి నియోజకవర్గంలో వైసిపి పార్టీని మరింతగా బలోపేతం చేయడమే తన ధ్యేయమని వైసిపి కావలి నియోజకవర్గ పరిశీలకులు కదిరి బాబురావు తెలిపారు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని ఆయన నివాసంలో కదిరి కలిశారు. ఎమ్మెల్యేతో ముచ్చటించారు. పరిశీలకులు కదిరి బాబు రావును ఎమ్మెల్యే, వైసిపి నేతలు దుశ్శా లువాలతో ఘనంగా సత్కరించి స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడారు. కావలి నియోజకవర్గంలో వైసిపి పార్టీలో ఏవైనా అసంతృప్తులు వుంటే ఎమ్మెల్యే సహకారంతో పరిష్కరించడం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రానున్న ఎన్నికలలో 175 సీట్లు గెలవాలన్న లక్ష్యంతో వున్నారన్నారు.అందుచేత ప్రతి నియోజకవర్గంలో గెలుపే ధ్యేయంగా పెట్టుకొని పనిచేయాలన్న ఉద్దేశంతో పరిశీలకులను నియమించడం జరిగిందన్నారు. పార్టీలో అందరిని ఒకే తాటిపై నడిపించి రానున్న ఎన్నికలలో గెలిచేలా పాటుపడతామన్నారు. ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు అందజేస్తామన్నారు.ఈ నియోజకవర్గంలో నెలకొని వున్న పరిస్థితుల్ని వైసిపి అధిష్టానానికి తెలియజేయడం జరుగుతుందన్నారు.

## నేటి నుండి శిక్షణా తరగతులు



**వింజమూరు,డిసెంబర్11ప్రభాతవార్త:** వింజమూరు మండలంలోని 12గ్రామ పంచాయతీల అభివృద్ధిపై ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలను రూపొందించేందుకు సోమ , మంగళవారాలు శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తామని ఎంపిడిఒ ప్రసన్నకుమారి తెలిపారు. గ్రామ పంచాయతీ ప్రజాప్రణాళికా ఉద్యమం 2022ను అనుసరించి పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక , బ్లాక్ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై మండల స్థాయిలో శిక్షణా తరగతులను స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహిస్తామన్నారు . సోమవారం ఎ.కిస్తీపురం, బుక్కాపురం, గుండెమడకల, నల్లగొండ్ల, వింజమూరు గ్రామాలకు, మంగళవారం నందిగుంట, శంఖవరం, కాటేపల్లి, ఊటుకూరు, రావిపాడు, చాకలికొండ, జనార్థనపురం పంచాయతీలకు శిక్షణ ఉంటుందన్నారు. ఈసమావేశానికి సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు , ఇతర శాఖల అధికారులు హాజరు కావాలని ఆమె కోరారు.

## చెరువులను తలపిస్తున్న పంటపోలాలు



**బిట్రగుంట,డిశంబర్11,ప్రభాతవా్ః** మాండూస్ తుఫాను ప్రభావంవలన బోగోలు మండలంలోని పలు గ్రామాలలో కురిసిన భారీవర్షాలకు పంటపొలాలన్ని జలమయమై చురువులను తలపిస్తున్నాయి.షుమారు ఇరవై రోజులక్రిం దట ఎంతో శ్రమించి నెలరోజులకిందట పోసిన వరినారు ని నాటి పంటవేసుకుంటే తుఫానుప్రభావంతో వర్షపునీటి తో ముంపుకు గురయ్యాయి.మరోరెడు రోజుల పాటు అల్పపీడనం, తుఫాను ప్రభావంవల్ల రెండు రోజులపాటు వర్షాలు వుంటాయని వాతావరణశాఖ హెచ్చరిస్తు ఒడడం తో రైతులు అందోళనకు గురౌతున్నారు. మండల ంలో కొన్ని గ్రామాలలోఅయితే వరినారు కయ్యల న్నీ వర్షపునీ రు చేరడంతో దెబ్బతింటాయని ఆవేదనకు గురౌతున్నా రు.దెబ్బతిన్న వరినార్లకు ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా సబ్సిడీపై వరి విత్తనాలిచ్చి ఆదుకోవాలని వారు కోరుచు న్నారు.ఇది ఇలావుండగ గత రెండురోజులనుంచి కురుస్తున్న భారీవర్షాలవల్ల మండలంలోని చెరువులన్ని పూర్తిస్తాయిలోనిండి కలుజులు పారుతున్నాయి. ఇప్పటివరకు మండలంలో ఎలాంటి ఆస్తి నష్ట సంబవించలేదని తహసిల్‌దార్ లక్ష్మీనారాయణ తెలిపారు.

## స్నేహానికి మారుపేరు సహదేవరెడ్డి



**బిట్రగుంట,డిశంబర్11,ప్రభాతవార్తః** స్నేహానికి మారుపేరు ఏనుగుల.సహదేవరెడ్డని జనసేనపార్టీ కావలి నియోజకవర్గపు ఇన్‌చార్జ్ అళహరి.సుధాకర్ చెప్పారు.బోగోలు మండలం విశ్వనాధరావుపేట పంచాయతిపరిధిలోని కొత్తూరు గ్రామంలో ఇటీవల మృతిచెందిన మాజీ సైనికోద్యోగి ఏనుగుల సహదేవరెడ్డి కుటుంభసభ్యుల్ని ఆదివారం ఆయన పరామర్శించారు. ఈసందర్బంగా మాట్లాడుతు తండ్రి డానియల్‌రెడ్డి అడుగుజాడల్లో సహదేవరెడ్డి నడిచేవారని సామాజిక స్పృహకలిగినవక్తిని కోల్పోవడం తనకెంతో భాద కలిగించిందన్నారు.ఆయన వెంట పార్టీ జిల్లా కార్యదర్శి వెంకటసుబ్బయ్య,మండలపార్టీ అధ్యక్షుడు షేక్.నూరుద్దీన్ పాల్గొన్నాడు.

## బిట్రగుంటలో విక్రమ సింహపురి ఎక్స్‌ప్రెస్‌ని నిలుపుదల చేయండి

**బిట్రగుంట,డిశంబర్11,ప్రభాతవార్తః** విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోని బిట్రగుంట రైల్వేస్టేషన్‌లో విక్రమ సింహపురి ఎక్స్‌ప్రెస్‌ని నిలుపుదల చేయాలని కావలి ఎం.ఎల్.ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి రైల్వే అధికారులకు,పార్లమెంటు సభ్యుడు ఆదాల ప్రభాకరరెడ్డికి,రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి,బీదా. మస్తాన్‌రావులకు తమ కార్యాలయంనుండి లేఖలు పంపి వారికి విజ్ఞప్తిచేసినట్లు బిట్రగుంట రైల్వే మజ్దూర్ యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షులు మద్దిబోయిన శేఖర్ తెలిపాడు ఇటీవల ఎం.ఎల్.ఎ గడప,గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బోగోలుకు విచ్చేసినపుడు ఎం.ఎల్.ఎ ప్రతాప్‌కుమార్‌రెడ్డికి మజ్దూర్ యూనియన్‌నాయకులు,వై.సి.పినేతలు గూడూరునుండి విజయవాడ,విజయవాడనుండి గూడూరుమద్య నడుస్తున్న విక్రమసింహపురి ఎక్స్‌ప్రెస్‌ని బిట్రగుంటలో నిలపాలని కోరిన మీదట ఆయన స్పందించి ఈలేఖలలో నిలుపుదల కోసం కోరారన్నారు.రైల్వే కార్మికులు డివిజనల్ కార్యాలయాలకు గాని విజయవాడలో రైల్వే ఆసుపత్రికి పోవాలన్నా ఈరైలు ఎంతో సౌకర్యంగా వుంటుందని అంతేకాక ప్రయాణీకుల సౌలభ్యంకోసంకూడా ఈరైలుని నిలుపుదల చేయాలని విజ్ఞప్తిచేసినందుకు ఎం.ఎల్.ఎకు ఆయన కృతగ్నతలు తెలిపారు.

## ఆశకార్యకర్తల ఉద్యోగాలకు దరఖాస్తులు స్వీకరణ



**వింజమూరు,డిసెంబర్11ప్రభాతవార్త:** వింజమూరు మండలంలో ఖాళీగా ఉన్న ఆశకార్యకర్తల ఉద్యోగాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని చాకలికొండ ప్రాధమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి డాక్టర్ మురళీధర్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వింజమూరులోని 1,2 సచివాలయ పరిధిలో ఒక్కొక్కటి, గుండెమడకల గ్రామంలో 1 మొత్తం మూడు పోస్టులను భర్తీ చేయనున్నామన్నారు. ఆసక్తికలిగిన మహిళలు 12వ తేదీ సోమవారం సాయంత్రం 4గంటల లోపు వింజమూరు పాత ఆసుపత్రిలో దరఖాస్తులను అందించాలన్నారు. దరఖాస్తు దారులు 10వ తరగతి పూర్తిచేసి, అదే ప్రాంతానికి చెందిన మహిళలై ఉండాలన్నారు. వయసు 25నుండి 45సంవత్సరాల లోపు కలిగి ఉండాలన్నారు. స్థానికులకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. వితంతు మహిళలు, ఒంటరి మహిళలు, విడాకుల ఇచ్చిన మహిళలకు ప్రాధాన్యత ఉంటుందన్నారు.

## రాష్ట్ర స్థాయి బ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ వేదిక



**కావలి, డిసెంబరు 11 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సమాఖ్య సహాయ సహకారాలతో జనవరి 8వ తేదీ సూళ్ళూరుపేటలోని శ్రీ సత్యసాయి కళ్యాణమండపంలో రాష్ట్ర స్థాయిలో బ్రాహ్మణుల వధూవరుల వివాహ పరిచయ వేదిక జరుగుతుందని బ్రాహ్మణ సంఘం నేతలు తెలిపారు. కావలి పట్టణం శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బ్రాహ్మణ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఐ.కామేశ్వరప్రసాద్, కావలి పట్టణ అధ్యక్షులు పి.వి.ఎస్.ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మతుకుమల్లి రాజేంద్రకుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టి.శ్రీనివాస్, శ్రీలతలు పాల్గొని మాట్లాడారు. ఈ పరిచయ వేదిక కార్యక్రమంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి వధూవరుల తల్లిదండ్రులు పాల్గొంటారని తెలిపారు. కావలి నియోజకవర్గంలోని బ్రాహ్మణులు వారి కుటుంబాలలో సిద్దంగా వున్న వధూవరుల పేర్లు ఈ వేదికకు పంపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివాహ పరిచయ వేదిక కరపత్రాన్ని విడుదల చేశారు.

## బివిఆర్ లేని లోటు తీర్చలేనిది



**చేజర్ల,డిసెంబర్11ప్రభాతవార్త:** నాగులవెలటూరు విద్యాభివృద్ధి దాత బొద్దులూరు వెంకటరత్నం చౌదరి లేని లోటు తీర్చలేనిదని నాగులవెలటూరు దత్తత స్వీయకర్త వేలూరి కేశవచౌదరి పేర్కొన్నారు. ఆదివారం నాగులవెలటూరులో జరిగిన బివిఆర్ అంత్యక్రియల్లో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో నాగులవెలటూరులో ప్రాధమికోన్నత విద్యవరకే ఉండేది. పేద ప్రజలు దూరం వెళ్ళి చదువుకోలేక ఎంతో మంది 7వ తరగతి వరకే చదివి అనంతరం మానేస్తుండడంతో గ్రామస్తులంతా చదువుకోవాలి , గ్రామం విద్యపరంగా అభివృద్ధిపథంలో నడవాలని ఆలోచించి తన సొంత 5ఎకరాల పొలాన్ని విరాళంగా ఇవ్వడంతోపాటు పాఠశాల భవనాలను కూడా తన సొంత నిధులతో నిర్మించి ఇచ్చారు . తన పెదనాన్న బొద్దులూరు సుబ్బరామానాయుడు జ్ఞాపకార్థం ఈపాఠశాలను నిర్మించి ఇచ్చాడన్నారు. పాఠశాల అభివృద్ధికూడా ఇప్పటికీ కృషి చేస్తుండేవాడన్నారు. ఇందిరాప్రియదర్శిని అవార్డు ను కూడా బివిఆర్ పొందాడని గుర్తు చేశారు. వ్యాపారరీత్యా చెన్నైలో ఉండేవాడని, గ్రామస్తులు ఎవరైనా అనారోగ్యంతో చెన్నైకి వెళితే వారికి తన సహాయ సహకారాలను అందించే మంచి మనసున్న బివిఆర్ చౌదరి మృతి నాగులవెలటూరుకు తీరని లోటన్నారు.

## ప్రభుత్వం నిర్లక్ష్యం వలన వరినాట్లు మునక



**కోవూరు,డిసెంబరు 11 ప్రభాతవార్త :** మండలంలో పంట కాలువలు సకాలంలో పూడిక తీయకపోవడంతో అకాల వర్షాల కారణంగా వరినాట్లు మునక ఏర్పడిందని సీపీఎం నాయకు లు గండవరం శేషయ్య పేర్కొన్నారు. కోవూరు మండలంలోని పలు ప్రాంతాల్లో నీట మునిగిన పొలాలను రైతు నాయకులతో కలిసి పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో రైతుల కొరకు గ్రామ సభలు ఏర్పాటు చేసి రైతుల ఇబ్బందులను అధికారులతో చర్చించి నిధులు కేటాయించి వర్షాకాలానికల్లా పంట కాలువలు శుభ్రం చేసేవారన్నారు. అయితే ఇప్పుడునన ప్రభుత్వం నేనే రాజు నేనే మంత్రి అన్న చందంగా పంట కాలువలు పూడిక తీయడం మర్చిపోయిందన్నారు. ఇప్పుడైనా అధికారులు చొరవ తీసుకుని సమగ్ర ప్రణాళికతో పూడిక తీయించి రైతులను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విజయకుమార్, జానకిరామ్, సురేష్, శ్రీనివాసులు, వెంకటరమణయ్య, ప్రసాద్‌లు ఉన్నారు.

## ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా సుధాకర్‌రెడ్డి



**కోవూరు,డిసెంబరు 11 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం 29వ సర్వజన మహాసభలో ఆదివారం జరిగిన రాష్ట్ర ఎన్నికల్లో నెల్లూరు జిల్లా నుంచి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా బి. సుధాకర్‌రెడ్డి, రాష్రష్ట కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎస్. నాగరాజులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన ఈ మహాసభలో వీరిని ఏకగ్రీంగా ఎన్నుకోవడం పట్ల ఏపీజీఈఏ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు వై. రమణారెడ్డి ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సీహెచ్ శశిధర్, పి. కృష్ణయ్యలు ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా ఎన్నికైన సుధాకర్‌రెడ్డి కోవూరు తాలూకా ఏపీజీఈఏ అధ్యక్షుడుగా కొనసాగుతున్నారు.

## సంవత్సరాల తరబడి తీరని కలుజు సమస్య



**కోవూరు,డిసెంబరు 11 ప్రభాతవార్త :** కోవూరులోని చెరువు సమీపంలో కలుజుకు గతంలోనే కోటి రూపాయల వ్యయంతో బ్రిడ్జి ఏర్పాటు చేస్తామని అప్పటి ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చినా నేటికీ అది కార్యరూపం దాల్చలేదు. ఫలితంగా కోవూరు వైపు నుంచి గుమ్మలదిబ్బ,. పాటూరు, యల్లాపాలెం, దామరమడుగు వెళ్లే ప్రజలు కలుజు ఉదృతంగా పారడంతో రాత్రి వేళల్లో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటీవల ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇరువురు భార్యాభర్తలు గుంటలో పడి గాయాలపాలైనారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ ప్రజాప్రతినిధులు కల్పించుకుని కలుజుకు శాశ్వత పరిష్కారం చూపాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

## ప్రముఖ వ్యాపారవేత్త, రైస్ మిల్లు యజమాని పోతుగంటి రోశయ్య అస్తమయం



**కావలి, డిసెంబరు 11 ప్రభాతవార్త:** కావలి పట్టణం ప్రముఖ వ్యాపారవేత్త, వైశ్య నేత, రైస్ మిల్లు యజమాని పోతుగంటి రోశయ్య(83)ఆదివారం సాయంత్రం మరణించారు. కావలి మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య మామ రోశయ్య. కావలి పట్టణంలోని ప్రముఖులైన రోశయ్య మృతి చెందడంతో వివిధ రంగాల్లోని వారు సంతాపం ప్రకటించారు. సోమవారం కావలి పట్టణ అరటితోటలోని పెద్దకుమారుడు శ్రీధర్ నివాసం వద్ద అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

## అకాల వర్షంతో విద్యుత్‌కు ఇబ్బందులు



**కోవూరు, డిసెంబరు11ప్రభాతవార్త:** కోవూరు నియోజకవర్గంలోని యల్లాయపాలెం సమీపంలో ప్రధాన విద్యుత్ లైన్లు ఇటీవల కురిసిన అకాల వర్షాలకు, ఈదురు గాలులకు చెట్లు పడి విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో సమాచారం తెలుసుకున్న కావలి ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు విజయకుమార్‌రెడ్డి, కోవూరు ట్రాన్స్‌కో డీఈ సతీష్‌బాబులు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని మూడు గంటలపాటు శ్రమించి ఎట్టకేలకు విద్యుత్ సరఫరా అందించారు. దీంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

## అధికారులు స్పందించండి....సర్వరాబాద్ గ్రామస్తులు



**ఉదయగిరి డిసెంబర్ 11 ప్రభాతవార్త:** ఉదయగిరి మండలం నెలటూరు పంచాయితీ సర్వరాబాద్ ఎస్‌సి కాలనీలోకి వెళ్లే ప్రధాన రహదారి చినుకుపడితే చిత్తడిగా మారి బురదతో నిండిన దారి లో ఆ కాలనీ వాసులు గ్రామం వెలుపలికి గానికి, గ్రామం లోపలికి వెళ్లడానికి తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.ముఖ్యంగా విద్యార్థులు స్కూల్‌కి వెళ్లేటప్పుడువృద్దులు,వైద్యశాలకు వెళ్లాల్సినప్పుడు ఆదారి వెంట ప్రయాణం ఇబ్బందిగా ఉందని వాపోతున్నారు.కనీసం అత్యవసర పరిస్థితులలో 108 లాంటి అత్యసర వాహనాలు లోపలికి రాలేని పరిస్థితి నెలకొని వుందనిఆ కాలనీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ విషయమై పలు మార్లు పంచాయితీ అధికారులకు,గ్రామ సర్పంచ్‌కి,గ్రామస్తులు విన్నవించుకున్నా పలితం శూన్యంగా ఉందని స్దానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా పాలకులు,అధికారులు స్పందించి మా కాలనీకి ప్రదాన రహదారి ని బాగు చేసే క్రమంలో సహాయం చేయాలని కోరుతున్నారు.

## మారని సమాచార హక్కు బోర్డు పేర్లు



**కోవూరు,డిసెంబరు 11 ప్రభాతవార్త :** ఒక వైపు సమాచార హక్కు చట్టం అనేక సమస్యలకు పరిష్కారం చూపుతున్న నేపథ్యంలో తప్పనిసరిగా ప్రతి ప్రభుత్వ కార్యాలయ ఆవరణలో సమాచార హక్కు బోర్డు ఏర్పాటు చేయడమే కాకుండా ఆ బోర్డులో అసిస్టెంట్ పబ్లిక్ ఇన్‌ఫర్‌మేషన్ అధికారి , పబ్లిక్ ఇన్‌ఫర్‌మేషన్ అధికారి, అప్పిలేట్ అధికారి అనే ముగ్గురు పేర్లు ఏర్పాటు చేయడమే కాకుండా వారి పేర్లు, ఫోన్ నెంబర్లు కూడా ఏర్పాటు చేయాలని ఇదివరకే సమాచార హక్కు రాష్ట్ర అధికారులు ఆదేశాలు కూడా ఇచ్చారు. అయితే కోవూరులోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో సమాచార హక్కు బోర్డులో బదిలీ అయిన అధికారి పేరు కూడా నేటికీ కానరావడం గమనార్హం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకుని బోర్డులో ప్రస్తుతం ఉన్న అధికారుల పేర్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## కాచి చల్లార్చిన నీటిని త్రాగాలి

**నెల్లూరు డిసెంబర్ 11, ప్రభాతవార్త-వైద్యం** తుఫాను ప్రభావంతో వాతావరణంలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయని, అందువలన ప్రతి ఒక్కరు కాచి చల్లార్చిన నీటిని త్రాగాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎం.పెంచలయ్య ఆదివారం ఒ ప్రకటనలో పేర్కొన్నారు. చలిగాలులు ఎక్కువగా ఉన్నందువల్ల వృద్ధులు, చిన్నారులు, బాలింతలు, గర్భిణీలు, అనారోగ్యంతో బాధపడుతున్నవారు శీతాకాలంలో తీసుకున్న జాగ్రత్తలను ఇప్పుడు తీసుకోవాలన్నారు. వర్షాకాలంలో నీరు కలుషితం అయి ఉంటాయని, అవి తాగడం వలన అతిసార, టైఫాయిడ్, కామెర్లు లాంటి అంటువ్యాధులు వ్యాపిస్తాయన్నారు. క్లోరినేషన్ చేసిన నీటిని తాగాలని, క్లోరిన్ మాత్రలు, అన్ని రకాల మందులు, అత్యవసర మందులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. తప్పనిసరిగా ఉపయోగించుకోవాలని, ఆహార పదార్ధాలను వేడిగా తినాలని, పౌష్టికాహారాన్ని ఎక్కువగా తీసుకోవాలన్నారు. చలిగాలులు తగలకుండా వెచ్చని దుస్తులు ధరించాలని సూచించారు. వారి వారి ప్రాంతాల్లో చుట్టుపక్కల నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని అన్నారు. 24గంటలు పనిచేసే అత్యవసర ఎపిడిమిక్స్ టీమ్‌ను, రాపిడ్ రెస్పాన్స్ బృందాలను గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

## కండలేరు పరవళ్లు..దీపకల్పాన్ని మరిపిస్తున్న మనుబోలు



**మనుబోలు, డిసెంబరు 11 ప్రభాతవార్త:** మండూస్ తుఫాన్ భారీ వర్షాలతో వర్షం దంచికొట్టింది. గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షం 15 సెంటీమీటర్లు నమోదైంది. దీంతో కండలేరు శని,ఆదివారాలలో ఏకధాటిగా పరవళ్లు తొక్కుతుంది. మనుబోలు మాగాణి పొలాలు, లోతట్టు గ్రామాలు మొత్తం వరద నీరు చుట్టుముట్టి దీపకల్పాన్ని మరిపిస్తున్నాయి. వెంకన్నపాళెం గ్రామానికి వెళ్లే రోడ్డు కిరువైపుల ఎల్లవ ప్రవాహం కనిపిస్తుంది. బద్వేల్ గ్రామంలో శివాలయం నీట మునిగింది. కండలేరు పరిసర ప్రాంతాలలో నారుమడులు నీట మునిగాయి. ఆదివారం తహశీల్దార్ సుధీర్ కొలనుకుదురు, కటోపల్లి గ్రామాలలో పర్యటించారు. ఆదివారం ఉదయం నుండి వర్షం నిలిచిపోవడంతో మనుబోలుకు వరద గండం తప్పింది. మనుబోలు చెరువు కలుజు పారుతుంది. కొలనకుదురు, కటోపల్లి తూర్పు దిక్కున వరద చుట్టుముట్టింది. భారీ వర్షాలు కురిసినప్పుడల్లా ఇక్కడ వరద ముంపుకు కావడం సర్వసాధారణంగా మారింది.

## తుఫాను బాధితులకు టీడీపీ సహాకారం



**కందుకూరు డిశంబరు 11, ప్రభాతవార్త:** తుఫాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు కందుకూరు పట్టణం 1వ వార్డు ఎస్టీ కాలనీని వరద ముంచెత్తింది. ఇళ్లలోకి నీరు రావడంతో రెండు రోజుల నుంచి కాలనీవాసులు వంటచేసు కోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. దీంతో కందుకూరు టీడీపీ ఇన్‌చార్జీ ఇంటూరి నాగేశ్వరరావు సూచనలతో టీడీపీ నాయకులు కాలనీకి వెళ్లి బాధితులను వరామర్శించారు. ఆదివారం మధ్యాహ్నం సుమారు 250మందికి భోజనవసతి కలి ్పంచారు.దీంతో కాలనీవాసులు ఇంటూరికి కృతజ్ఞతలు తెలిపారు.నాయకులు గానీ, అధికారులు గానీ తమను పట్టించుకోవలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో తెదేపా పట్టణ అద్యక్షుడు దామా మల్లేశ్వరరావు, వార్డు అధ్యక్షుడు తూమాటి ప్రసాద్, ఇతర నేతులు ముచ్చు వేణు, ముప్పవరపు వేణు, తదితరులు పాల్గొన్నారు.

























## పెట్రోల్ బంకు తెరిపించండి

**ఉదయగిరి డిసెంబరు 11 ప్రభాతవార్త** : ఉదయగిరి మండలం గండిపాళెం గ్రామంలోని పెట్రోల్ బంకులో పెట్రోల్ ,డీజల్ గత 12 రోజుల నుండి లేని కారణంగా ఆప్రాంతంలోని వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నా రు.పంటకాలం అయినందున రైతులకు ట్రాక్టర్లకు డీజల్ అవసరం ఉన్నందున గండిపాళెం నుండి చుట్టుపక్కల సుమారు 20 కిలోమీటర్ల మేర మరో పెట్రోల్ బంకు లేని కారణంగారైతు సోదరులు ఇబ్బందని ఎదుర్కునడమే కాకుండా కాలయాపన వల్ల నష్టాన్ని చవిచూడాల్సి వస్తుంది.ఇప్పటికి పెట్రోల్ బంకు యజమాన్యాం తక్షణమే స్పందించి పెట్రోల్ ,డీజల్ కొరత లేకుండా చూడాలని వాహన దారులు కోరుతున్నారు.










## ఎస్వీపియం ఛానల్‌కు గండి



**బిట్రగుంట, డిసెంబరు 11 ప్రభాతవార్త** బోగోలు మండలం నాగులవరం సమీపంలో ఎస్వీపియం ఛానల్‌కు ఆదివారం సాయంత్రం గండిపడింది. మాండోస్ తుఫాన్ ప్రభావం వల్ల గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కావలి కాలువ నుండి ఎస్వీపియం ఛానల్‌కు సాగునీరు సరఫరా చేసే చోట గండిపడింది. ఈ గండిని ఇరిగేషన్, సోమశిల శాఖల అధికారులు స్పందించి యుద్ధప్రాతిపదికపై మరమ్మతులు చేయకపోతే నాగులవరం పంచాయతీలోని చెన్నారెడ్డిపాళెం లోతట్టు ప్రాంతాలన్ని మునకకు గురయ్యే అవకాశం వుందని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ సమస్యని స్థానిక శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి స్పందించి సంబంధిత అధికారులు చర్యలు తీసుకునేలా చూడాలని మండల వైసిపి కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు విజ్ఞప్తి చేశారు.

## మహేష్‌చంద్‌కు ఘన సన్మానం



**నెల్లూరు టౌన్, డిసెంబరు 11, ప్రభాతవార్త:** సినీ దర్శకులు మహేష్ చంద్‌కు పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. నెల్లూరు జాకీర్‌హుస్సేన్ నగర్‌లో ప్రముఖ సినీ దర్శకుడు మహేష్‌చంద్ సందర్శించారు. ఈ సందర్భంగా పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె.మురళీమోహన్‌రాజు మాట్లాడుతూ చిత్ర దర్శకుడు మహేష్‌చంద్ ప్రేయసిరావే, అయో ధ్య రామయ్య, చెప్పాలని ఉంది, జోరుగా హుషారుగా, ఒక్కడే, హనుమంతు, ఆలస్యం అమృతం, రెడ్ అలర్ట్, పలు చిత్రాలకు దర్శకతవం వహించారన్నారు. వీటితో పాటు పలు తమిళ, కన్నడ, మలయాళ చిత్రాలకు దర్శకత్వం వహించారన్నారు. దర్శకుడు వై.వి.రమణారెడ్డి, బి.రమేష్‌బాబు, బి.రమ, అందే రాము, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## కరేడు జడ్పీహెచ్ స్కూల్‌లో రిలీఫ్ సెంటర్ ఏర్పాటు



**ఉలవపాడు, డిసెంబరు 11, ప్రభాతవార్త** మండలంలోని కరేడు గ్రామంలో మాండూస్ తుఫాన్ కారణంగా ఇబ్బంది పడుతున్న ఎస్టీ కుటుంబాల వారి కోసం జడ్పీహెచ్ స్కూల్‌లో రిలీఫ్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు తహశీల్దార్ ఎస్‌కే మహ్మద్ హుస్సేన్ తెలియజేశారు. ఎస్టీ కుటుంబాలకు చెందిన వారికి భోజన సదుపాయం కల్పించడం జరిగింద న్నారు. ఒక్కొక్క కుటుంబానికి రూ.2వేలు అందజేయడం జరుగుతుందని తెలియజేశారు.

## ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై చర్య తీసుకోవాలి

**సీతారామపురం డిసెంబర్ 11 ప్రభాత వార్త** ప్రభుత్వభూములు,స్థలాలు, కాలువలు చెరువులను ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని శ్రీ ప్రగతి డవలప్‌మెంట్ సొసైటీ డైరక్టర్ బొగ్గవరపు రత్నం కోరారు.ఆదివారం ఆయన విలేఖర్ల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతు సీతారామపురం నుండి అలుగు పోరంబోకు చెరువులోని కొంత స్థలాన్ని కొందరు కబ్జాదారులు ఆక్రమించుకొని యద్దేచ్ఛగా అందులో శాశ్విత నిర్మాణాలు షేడ్లు వేసు కొని వాటిని వ్యాపరస్తులకు బాడుగకు ఇచ్చి వేలాదిరూపాయాలను సొమ్ము చేసుకొంటు ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని ఇది చాలా అన్యాయమని ప్రభుత్వ భూములు స్థలాలు,ప్రభుత్వానికు చెందాలన్నారు.స్థానిక బస్టాండ్ సమీపంలో అనాదిగా ఆక్రమణల జోరు కొనసాగుతుందని అధికారులు పట్టించుకోనందున దురక్రమాణ పర్వం కొనసాగుతుందని అన్నారు.ప్రధానంగా ఇరిగేషన్ ఆర్అండ్‌బి రెవిన్యూ,పంచాయితీ రాజ్ అధికారులు ఈ ఆక్రమణల గురించి ఏ మాత్రం పట్టిం చుకున్న దాఖలాలు లేవన్నారు. ఈ ప్రభుత్వం అధికారంలో ఉంటే ఆ ప్రభుత్వానికి చెందిన రాజకీయ నాయకులు ఒత్తిళ్ల కారణంగా అధికారులు సైతం మౌనం వహిస్తున్నారని ఎవ్వరైనా వారి దృష్టికి తీసుకొని వెళ్లినప్పుడు మాత్రం నోటీసులు ఇస్తామని చర్యలు తీసుకుంటామని చెబుతున్నారే తప్ప ఆదిశగా కొనసాగడం లేదని అన్నారు.బస్టాండ్ కూడలి నుండి ఉదయగిరి వెళ్లే మార్గం వైపు అలుగు,కాలువపైన పలు నిర్మాణాలు ఆక్రమించుకొని నేర్మించినా ఎవ్వరికి పట్టిలేదని అలుగు ఆక్రమణపై ఇటీవల జిల్లా ఇరిగేషన్ అధికారులు పరిశీలించి అలుగు ఆక్రమణకు గురైందని నిర్ధారించి ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆర్‌డిఒకి తెలియజేశారని,అలాగే తహసిల్దారు కూడా తెలియజేశారని కాని చర్యలు తీసుకోలేదని ఆరోపించారు.మండల కార్యాలయం ఎదురుగా వున్న ప్రభుత్వ భూములు కబ్జేదేటే అక్రమణకు గురౌతున్నా అధికారులు చూస్తున్నారేగాని చర్యలు తీసుకోలేదని ఆయన ఆరోపించారు.సీతారామపురం నుండి డిజిపేట రహదారి వెంబండి ప్రభుత్వ భూమి,ఉదయగిరి రోడ్డులోని శ్మశాన స్థలం కూడా ఆక్రమణకు గురైనా వాటి గురించి,రెవిన్యూ,ఆర్అండ్‌బి అధికారులు పట్టించుకోవడం లేదని ,అలుగు కాలువ వెంబడి నిర్మాణాలు ఎక్కువ అవుతునా న్న ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని ఒక్కొక్కటిగా అలుగు కాలువలోకి నిర్మాణాలు జరుగుతున్నాయని అన్నారు.ఈ ఆక్రమణల వలన కాలువులు పూడిపోతున్నాయని వరదల సమయంలో నీరు వెళ్లేందుకు వీలు లేక పై ప్రాంతాలు జలమయమై అవకాశం ఉందని అన్నారు. సీతారామాపురం నుండి డిజిపేటకు వెళ్లే రోడ్డుకు ఇరువైపుల గల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని దుకాణాలు ఆక్రమించుకొని వున్న అధికారులు పట్టించుకోవడం లేదనిఅన్నారు.ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## నీట మునిగిన వేరుశనగ



**ఉలవపాడు, డిసెంబరు 11, ప్రభాతవార్త** మాండూస్ తుఫాను కారణంగా భారీగా కురిసిన వర్షాల వల్ల మండలంలోని తీరప్రాంత గ్రామాలైన కరేడు, పల్లెపాలెం, టెంకాయచెట్లపాలెం, భట్టిసోమయ్యపాలెం, చాకిచెర్లలో సాగుచేసిన వేరుశనగ పంట నీట మునిగింది. సాగు చేసిన రైతులు తీవ్ర నష్టాల పాలయ్యామని, నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

## తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన జనసేన నాయకులు



**నెల్లూరు,డిసెంబరు11 ప్రభాతవార్త-విద్య** మాండోస్ తుఫాను దాడికి ముంపుకు గురైన నగరంలోని స్థానిక 30వ డివిజన్ పరిధిలోని వైఎస్ఆర్ నగర్‌లో జనసేన జిల్లా ప్రధానకార్యదర్శి గునుగుల కిషోర్ పర్యటించి బాధితులను అడిగి వారి సమస్యలను తెసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మా ట్లాడుతు తుఫాను దాడికి ఎడతెరపులేకుండా భారీవర్షాలు కురవటంతో ఈ ప్రాంతం పూర్తిగా జలమైందన్నారు. ఈ ప్రాంతం ఏర్పడి 10 సంవత్సరాలు పూర్తి అవుతున్నా అభివృద్ధి మాత్రం జరుగలేదని ఆరోపించారు. రూరల్‌లో తమకు ఎదురులేదని, చెప్పుకుని తిరిగే స్థానిక ఎమ్మెల్యేకి ప్రజల కష్టాలుపట్టవంటు దుయ్యబట్టారు. ఈ ప్రాంతంలో ప్రజలకు కనీస మౌళికవసతులు కల్పించటంలో అధికార పార్టీ ఎమ్మెల్యే పూర్తిగా విఫలం చెందారన్నారు. ప్రజా బాట పేరుతో ఎమ్మెల్యే నిర్వహించే పాదయాత్ర కేవలం రోడ్లకు మాత్రమే పరిమితం అవుతుందని, ఈ ప్రాంతంలో ఇప్పటివరకు మంచినీటి సౌకర్యాన్ని కల్పించలేదన్నారు. ట్యాంకర్లతో మంచినీరు సరఫరా చేసినా ప్రతి ఇంటికి చేరని పరిస్థితి ఇక్కడ నెలకొందన్నారు. ఎన్నికల సమయంలో కనిపించిన స్థానిక కార్పొరేటర్ గెలిచిన తరువాత ఇంతవరకు తమకు కనిపించలేదని స్థానికులు తెలపటం విడ్డూరంగా ఉందన్నారు. దట్టమైన చెట్లు పొదలతో ఈ ప్రాంతం అడవిని పోలి ఉందని తరచు పాములు ఇండ్లలోకి రావటంతో స్థానికులు భయాందోళనలక గురి అవుతన్నారన్నారు. నగరంలో ఇలాంటి ప్రదేశం ఉందని కూడా అధికారులు మరిపోయారని వాపోయారు. రూరల్ ప్రాంతంలో అభివృద్ధి శూన్యమని ఆరోపించారు. అలాగే తుఫాను ముంపు ఉందని వాతావరణశాఖ వారం రోజుల ముందునుండి హెచ్చరిస్తున్నా అధికారులు ముందస్తు నష్ట నివారణ చర్యలు తీసుకోవటంలో విఫలం చెందారని ఆవేదన వ్యక్తంచేశారు. వెంటనే ఈ ప్రాంతంలో సమస్యలను అధికారులుపరిష్కరించి మౌళిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. లేకుంటే తమ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు శీను, కంధర్, అమీన్, ప్రశాంత్‌గౌడ్, రాజా, పాల్గొన్నారు.

